క్లుప్తంగా

వేదిక ద్వారా సమస్యల పరిష్కారం



వినతులు స్వీకరిస్తున్న సాధిక్

జగదాంబ: వైఎస్సార్‌సీపీ ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని జీవీఎంసీ 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ అన్నారు. మంగళవారం వార్డులో జీవీఎంసీ ఎంవీడీఎం పాఠశాల దరి సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. గత ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన సమ్యలు వైఎస్సార్‌సీపీ హయాంలో పరిష్కారం అవుతున్నాయన్నారు. పెన్షన్లు, యూజీడీ, రేషన్‌కార్డుల సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి సచివాలయాల ద్వారా పరిష్కరిస్తున్నామని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించడానికి ఈ వేదిక ఉపయోగపడుతుందని సాధిక్ అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీధర్, నాయకులు

కంచరపాలెం: జ్ఞానాపురం జేఎస్ఎన్‌యూఆర్ఎం కాలనీలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం, ప్రహరీని వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ సొంత నిధులతో నిర్మించారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ వార్డు సీనియర్ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్ వీటిని ఆవిష్కరించారు. అనంతరం పీవోడబ్ల్యు లక్ష్మి, ఐఎఫ్‌టీయూ వెంకటేశ్వర్లు తదితర ప్రజా సంఘాల నేతలతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంబేడ్కర్ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి చేసిన కృషిని కొనియాడారు.

అపరిశుభ్రతకు తావీయొద్దు



బ్లాక్‌స్పాట్‌ను శుభ్రం చేయిస్తున్న ఏఎంహెచ్‌వో కిశోర్

జగదాంబ: ఎక్కడా అపరిశుభ్రత లేకుండా అంతా పరిశుభ్రం చేయాలని జీవీఎంసీ జోన్–4 అడిషనల్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఎన్. కిశోర్ అన్నారు. జోన్–4 పరిధిలో మొత్తం 12 వార్డుల్లో డ్రైనేజీల బ్లాక్‌లు, యూజీడీ లీక్‌లు, రహదారిపై వదిలేసిన వ్యర్థాలను శుభ్రం చేయాలన్నారు. దీనిపై నిరంతరం పర్యవేక్షణ జరుగుతుందన్నారు. ముఖ్యంగా బ్లాక్‌స్పాట్‌లు, చెత్త పడే ప్రాంతాలు పరిశుభ్రం చేసి ఆ ఫొటోలు కమిషనర్‌కు పంపించాలని తెలిపారు.

స్వామి వివేకానంద సంస్థలో నారాయణ సేవ



నారాయణ సేవలో గ్రీష్మ కుటుంబ సభ్యులు

దాబాగార్డెన్స్: పాతనగరంలో గల స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థలో అట్లూరి గ్రీష్మ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం 500 మంది పేదలకు అన్నదానం, సంస్థ ఆశ్రమ వాసులకు వస్త్రదానం చేశారు. కార్యక్రమంలో వైష్ణవి ఏజెన్సీ అధినేత గంట రాఘవేంద్రరావు, వాణి, వైష్ణవి, గౌరీనాథ్, సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సభ్యులు పాల్గొన్నారు.

ఎక్కడి వాహనాలు.. అక్కడే గప్‌చుప్

- వార్డుల్లో పూర్తి స్థాయిలో తిరగని క్లాప్ వాహనాలు
- అంతా సవ్యమే అంటూ రికార్డుల్లో నమోదు
- ఏఎంహెచ్‌వో దృష్టిలో పడిన బాగోతం



డంపింగ్ యార్డు పార్కింగ్‌లోనే క్లాప్ వాహనాలు

జగదాంబ: జీవీఎంసీ జోన్–4 టౌన్‌కొత్తరోడ్డు డంపింగ్ యార్డులో అవకతవకలు ఒక్కొక్కటి బయటపడుతున్నాయి. ఈనెల 12వ తేదీన చెత్త సేకరణ, డంపింగ్‌పై 'అలసత్వం' శీర్షికన వార్త వెలువడిన విషయం తెలిసిందే. అయితే వారం గడవక ముందే మరో అంశం తెరపైకి వచ్చింది. ప్రభుత్వం ఇంటింటి చెత్త సేకరణ పేరుతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన క్లాప్ వాహనాలు యార్డుకే పరిమితం అవుతున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి ఉదయం 6 గంటలకే క్లాప్ వాహనాలు వార్డుల్లో ఉండాలనే ప్రభుత్వ ఆదేశాలను జీవీఎంసీ మెకానికల్ సెక్షన్ అధికారులు, కింది స్థాయిలో యార్డు ఇన్‌స్పెక్టర్లు తుంగలో తొక్కేస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఉన్నప్పుడు తప్ప.. మిగతా సమయాల్లో క్లాప్ వాహనాలు పూర్తిస్థాయిలో వార్డుల్లో తిరగడంలేదు. కాని చేతిరాత రికార్డులే కావడంతో ఆ వాహనాలు వార్డుల్లో తిరుగుతున్నట్లే చూపిస్తున్నారు.

సేకరణ.. తరలింపులో ఒక్కటే తంతు..

చెత్త సేకరణలో ఎంత తప్పు జరుగుతుందో తరలింపులో కూడా అలాగే జరుగుతున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి క్లోజ్డ్ కాంపెక్ట్ వాహనం ఒక్కో దానిలో రోజుకు 1100 టన్నుల చెత్త తరలించాల్సి ఉంది. అయితే ఆ స్థాయిలో చెత్త కాపులుప్పాడ యార్డుకు తరలింపబడడం లేదు. కాని దీన్ని కప్పిపుచ్చి అంతా సవ్యంగానే జరుగుతున్నట్లు యార్డులో స్టాక్ చూపిస్తున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన కెమెరాలు పని చేయకుండా చేసి.. నిఘాకు అందకుండా మోసగిస్తున్నట్లు సమాచారం.

ఆయిల్ ఏమవుతుంది?

నిర్ణీత ట్రిప్పులు వాహనాలు తిరగకుండా ఆయిల్ ఏమవుతుంది? ఖర్చు ఎలా చూపిస్తున్నారు.. లాగ్ బుక్కుల్లో తప్పులు చూపిస్తు రికార్డులు తారుమారు చేస్తున్నారు. ఉదయాన్నే పర్యవేక్షణ చేయాల్సిన మెకానికల్ సెక్షన్ అధికారుల కనుసన్నల్లో జరుగుతున్న ఈ తంతు జీవీఎంసీ ఉన్నతాధికారులకు తెలియపోవడంతో అవకతవకలు మరింత ఎక్కువ అవుతున్నాయి. వాడని ఆయిల్ వాడినట్లు కాకి లెక్కలు నమోదు చేస్తున్నారు.



ఈనెల 12న సాక్షిలో ప్రచురించిన అలసత్వం కథనం (ఫైల్)

ఏఎంహెచ్‌వో చేతికి రికార్డులు..

ఎంఎస్‌ఎఫ్ డంపింగ్ యార్డులో జరుగుతున్న అవకతవకలపై జోన్–4 ఏఎంహెచ్‌వో కిశోర్ రికార్డులు పరిశీలన చేయగా పలు అవకతవకలు బయటపడడంతో ఆయన రికార్డులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఈ తతంగమంతా పరిశీలించేందుకు రోజువారి ఉపయోగిస్తున్న ఆయిల్‌కు సంబంధించి లాగ్‌బుక్కులు తీసుకురావాలని యార్డు ఇన్‌స్పెక్టర్‌కు ఆదేశించినట్లు తెలిసింది. ఇదే గాని నిజమైతే ఎంత అవినీతి జరిగిందో తేటతెల్లమయ్యే అవకాశం ఉంది.

పర్యవేక్షణ లోపమే ప్రధాన కారణం..

జీవీఎంసీ జోన్–4 కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న ఎంఎస్‌ఎఫ్ (డంపింగ్ యార్డు) పర్యవేక్షణ లోపానికి గురవుతోంది. రోజూ పర్యవేక్షించాల్సిన జోనల్ స్థాయి అధికారి కేవలం కాలువలు, రోడ్ల పరిశుభ్రతకే పరిమితం కావడంతో యార్డులో అవకతవకలు యథావిధిగా జరిగిపోతున్నట్లు చెబుతున్నారు.

రికార్డులు స్వాధీనం చేసుకున్నాం

క్లాప్ వాహనాల పనితీరు, డంపింగ్ యార్డులో జరుగుతున్న లావాదేవీలపై పరిశీలన చేసి రికార్డులు స్వాధీనం చేసుకున్నాం. వాటికి సంబంధించి లాగ్‌బుక్కులు తీసుకురావాలని ఆదేశించాం. పరిశీలనలో తేలిన అంశాలు కమిషనర్ దృష్టికి తీసుకువెళతాం.

–ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎన్.కిశోర్, జీవీఎంసీ జోన్–4.

ఘనంగా బాబా ఆలయ వార్షికోత్సవం



సాయిబాబాను దర్శించుకుంటున్న పీల వెంకట అప్పలనాయుడు, కర్రి నీలకంఠం తదితరులు

అల్లిపురం: జీవీఎంసీ 34వ వార్డు పరిధి నారాయణవీధిలో వెలసిన షిర్డీ సాయిబాబా ఆలయం 16వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం నుంచి విశేష పూజా కార్యక్రమాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం సాయిబాబాను విశేషంగా అలంకరించారు. బాబాను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరి విశేష పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ అధ్యక్షుడు పీల వెంకట అప్పలనాయుడు, 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, ఆలయ కమిటీ సభ్యులు సునీత, మాలతి, పద్మ, రేణుక యల్లమ్మ అమ్మవారి దేవాలయం అధ్యక్షుడు కర్రి నీలకంఠం, బొడ్డు పోలారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమం చేపట్టారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. రమేష్‌నాయుడు, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

27న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో ఈ నెల 27న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో రమేష్‌నాయుడు తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఆయన పేర్కొన్నారు.

సీఎం జగన్ పాలనకు ప్రజా మద్దతు

సర్వేలో స్పష్టమైందన్న ఎమ్మెల్యే వాసుపల్లి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్: జగనన్న పాలనకు ప్రజలంతా జై కొడుతున్నారని.. ఆ విషయం సర్వేల్లో స్పష్టమయిందని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం పరదేశమ్మ గుడి వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రభుత్వానికి, జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు మద్దతుగా 75 లక్షల పైచిలుకు కాల్స్ వచ్చాయన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 25 ఎంపీ సీట్లకుగాను 24 ఎంపీ సీట్లు కై వసం చేసుకోవడం ఖాయమని అన్ని సర్వేలు చెబుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజలకు నమ్మకం.. భరోసా ఏర్పడ్డాయన్నారు. నియోజకవర్గంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో 55 వేల కుటుంబాలను కలిశామన్నారు. వారంతా జగనన్న పాలనపై హర్షం వ్యక్తం చేశారన్నారు. సుమారు రూ. 2 లక్షల కోట్లు వివిధ పథకాల ద్వారా లబ్ధిదారులకు నేరుగా వారి బ్యాంకు అకౌంట్లో జమ చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ, 27వ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ ఉద్యోగుల సమస్యలపై కమిషనర్‌కు వినతి

దాబాగార్డెన్స్: జీవీఎంసీ ఉద్యోగులు, కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై కమిషనర్ సాయికాంత్ వర్మకు వినతిపత్రం అందజేసినట్టు స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వీవీ వామనరావు ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యల పరిష్కారానికి గత కమిషనర్‌కు ఈ ఏడాది ఫిబ్రవరి 8న సమ్మె నోటీస్ ఇచ్చామని, కానీ ఇప్పటి వరకు సమస్యలు పరిష్కారం కాలేదని ఆ వినతిలో పేర్కొన్నట్టు తెలిపారు. వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరించాలని కోరారు.

మేజర్ పోర్టుల ప్రైవేటీకరణ ఆపాలి



పోర్టు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

జగదాంబ: కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరుతూ పోర్టు చైర్మన్ కార్యాలయం ఎదుట విశాఖపట్నం అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు నల్ల రిబ్బన్లతో నిరసన తెలిపారు. సోమవారం పోర్టు కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో విశాఖ పోర్టు కార్మిక సంఘాల కార్యదర్శి బి.జగన్ మాట్లాడుతూ షరతుల్లేని పింఛన్‌తో కూడిన వేతన ఒప్పందం చేయాలన్నారు. కొత్త బోనస్ ఫార్ములా రూపొందించి వెంటనే బకాయిలు చెల్లించాలన్నారు. 2004 తరువాత చేరిన ఉద్యోగులకు కొత్త పెన్షన్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేయాలని, ఫూల్, కశాసీ, క్యాజువల్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలన్నారు. పోర్టు స్టేడియం, కల్యాణ మండపాలు, ఆస్పత్రి బిల్డింగ్‌లు, పోర్టు భూముల ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేస్తూ ఐదు ఫెడరేషన్ల ఆధ్వర్యంలో నిసరన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీహెచ్ మసేన్, హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి బీకే శర్మ, సీఐటీయూ పోర్టు యూనియన్ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కనకారావు, చందు, జె.సత్యనారాయణ, అంజి,త్రినాథరావు, నరసింగరావు, యల్లారావు పాల్గొన్నారు.

గిరిజన రోగులకు తక్షణ చికిత్స అందించండి



ట్రైబల్‌సెల్ సిబ్బందితో మాట్లాడుతున్న ఏఎస్ఆర్ జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా

మహారాణిపేట : గిరిజన రోగులకు తక్షణం చికిత్స అందించాలని ఏఎస్ఆర్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జమాల్ బాషా కేజీహెచ్ వైద్యులను కోరారు. మంగళవారం ట్రైబల్ సెల్‌ను సందర్శించిన ఆయన అత్యవసర చికిత్సల కోసం కేజీహెచ్‌కు వచ్చే గిరిజన రోగులకు సెల్ సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. అత్యవసర సమయంలో అంబులెన్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. గిరిజనుల కోసం ప్రభుత్వం చేపట్టిన పథకాల ఫలాలు వారికి అందేలా చిత్తశుద్ధితో సిబ్బంది విధులు నిర్వర్తించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యువకుడిని రక్షించిన లైఫ్‌గార్డ్స్



ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన యువకుడిని రక్షించిన లైఫ్‌గార్డ్స్

అల్లిపురం: విజయనగరం జిల్లా బొబ్బిలికి చెందిన వాసిరెడ్డి సంతోష్‌కుమార్ బీచ్ ఒడ్డున అనుమానాస్పదంగా తిరుగుతూ ఆత్మహత్య చేసుకునే ఉద్దేశంతో సముద్రంలోకి వెళుతుండగా అక్కడే విధులు నిర్వర్తిస్తున్న ఎం.ధనరాజు, పి.రవివర్మ, వి.ఎర్రిరాజు అతన్ని వారించి ఒడ్డుకు తీసుకు వచ్చి మహారాణిపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్కడ అతనికి కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. యువకుడి ప్రాణాలు రక్షించిన లైఫ్ గార్డ్‌లను సీపీ సీఎం త్రివిక్రమవర్మ అభినందించారు.

నిర్ణీత కాల వ్యవధిలో భూ సర్వే పనులు పూర్తి చేయాలి



అధికారులతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా మాట్లాడుతున్న జేసీ విశ్వనాథన్

మహారాణిపేట : భూ సర్వే పనులు నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయాలని రెవెన్యూ డివిజనల్ అధికారులు, మండల తాసీల్దారులను జిల్లా జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్ ఆదేశించారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. మీసేవ, ఏపీ సేవ, స్పందన ద్వారా ప్రజల నుంచి వచ్చే అర్జీలను సత్వరం పరిష్కరించాలన్నారు. ఏపీఐఐసీ, ఎన్‌హెచ్–16, రైల్వే భూములకు సంబంధించి మ్యుటేషన్ పనులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. ఈనెల 26 నుంచి మే 25 వరకు నెల రోజుల పాటు మండల తాసీల్దార్ కార్యాలయంలో సింగిల్ విండో సేవలు అందుబాటులో ఉంటాయని, ప్రజలు భూపట్టాలకు సంబంధించి సవరణలు చేసుకోవచ్చన్నారు. డీఆర్వో శ్రీనివాసమూర్తి, భీమిలి ఆర్డీవో భాస్కర్‌రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే విజయ్‌కుమార్, కలెక్టరేట్ పరిపాలన అధికారి ఈశ్వరరావు, ఎస్‌డీసీలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



ధర్నాలో నినాదాలు చేస్తున్న ఏపీ జేఏసీ (అమరావతి) నాయకులు

మహారాణిపేట : కాంట్రాక్ట్ ఉద్యోగులు గత 20 సంత్సరాలుగా రెగ్యులర్ కాకుండా ఉన్నారని ఏపీ ఉద్యోగ సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ సత్తి నాగేశ్వర రెడ్డి అన్నారు. మంగళవారం సంఘాల కార్యాచరణ సమితి జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమీపంలోని ఎన్‌జీవో హోంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఎన్‌జీవో సంఘం అధ్యక్షుడు కె.ఈశ్వరరావు, కార్యదర్శి రవిశంకర్, సిటీ కార్యదర్శి సత్యనారాయణ, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్ఏ త్రినాథరావు, అమరావతి కో చైర్మన్లు ఎ. శ్రీనివాసరావు, నమ్మి శ్రీనివాసరావు, కార్యదర్శి మహేష్, కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగ సంఘం నాయకుడు వి. వీరబ్రహ్మం, కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

మన ఆరోగ్యం.. మన చేతుల్లోనే..

ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా వైద్యుల అవగాహన



భీమ్‌నగర వైఎస్సార్ అర్బన్ క్లినిక్ నుంచి ర్యాలీగా వెలుతున్న వైద్య సిబ్బంది

అల్లిపురం: దోమలను నివారిద్దాం.. అంటువ్యాధులను తరిమికొడదాం.. అనే నినాదంతో భీమ్‌నగర్ వైఎస్సార్ అర్బన్ క్లినిక్ సిబ్బంది ర్యాలీ చేపట్టారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మంగళవారం భీమ్‌నగర్, వైఎస్సార్ అర్బన్ క్లినిక్ సిబ్బంది, మలేరియా సిబ్బంది ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీ భీమ్‌నగర్, వెంకటేశ్వరమెట్ట, అల్లిపురం ప్రాంతాల్లో సాగింది. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్లు భారతి, నర్మద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమతెరలు వాడాలని, ప్రజారోగ్యానికి దోమలు ప్రధాన శత్రువులని తెలిపారు. ఆరోగ్యంగా జీవిద్దాం.. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని ఆరోగ్య సిబ్బంది నినాదాలు చేశారు. కార్యక్రమంలో మురళీకృష్ణ, జీవీఎంసీ సిబ్బంది, ఆశ వర్కర్లు, డాట్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌కు విశేష స్పందన



దొండపర్తి ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

అల్లిపురం: నియోజకవర్గంలో సమస్యలపై ఎమ్మెల్యే వాసుల్లి గణేష్‌కుమార్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. మంగళవారం దొండపర్తి, ఫిషింగ్ హార్బర్‌లో చేపట్టిన ప్రజాదర్బార్‌లో ఆయన ప్రజల వినతులు స్వీకరించి, అధికారులతో మాట్లాడి వాటిని పరిష్కరించారు. పలువురు మత్స్యకారులు ఆయనను కలిసి మత్స్యకారులకు ఉపయోగపడే జెట్టీ అభివృద్ధి పనులు వేగవంతమయ్యేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫిషరీస్ అసోసియేషన్ సభ్యులు కొండబాబు, శేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు అచ్యుత్, సాగర్, రామరాజు, వాసు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

దొండపర్తిలో..

పరదేశమ్మ గుడివద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుపల్లి పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వాటి పరిష్కారానికి అధికారులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో తాను పని చేస్తున్నానన్నారు. డయల్ యువర్ ఎమ్మెల్యే, ప్రజాదర్బార్ కార్యక్రమాల ద్వారా ప్రజల సమస్యలు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ, జేసీఎస్ ఇన్‌చార్జి దొడ్డి రామానంద్, పీతల వాసు, 27వ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి, స్టేట్ డైరెక్టర్ సంకభక్తుల ప్రసాద్, పార్టీ నాయకులు దొడ్డి బాపూ ఆనంద్, బొర్రా శ్రీనివాసరెడ్డి, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



జోన్-4 కార్యాలయంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం

మహారాణిపేట: జీవీఎంసీ 29వ వార్డు వెంకటపతిరాజునగర్‌లో కార్పొరేటర్ ఉరికిటి నారాయణరావు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు సీతంరాజు సుధాకర్ చేతుల మీదుగా చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ఇటువంటి చలివేంద్రాలు ప్రారంభించడం వలన ఈ దారిలో ప్రయాణించే వారి సేదదీర్చే వారమవుతామని అన్నారు. కంటి ఆపరేషన్ చేయించుకున్న ప్రకాశరావుపేటకు చెందిన టైలర్ రామకృష్ణకు ఆర్థిక సహాయం అందజేశారు. కార్పొరేటర్ ఉరికిటి నారాయణరావు, సచివాలయం క్లస్టర్ ఇన్‌చార్జి నీలకంఠం, పార్టీ నాయకులు కండిపల్లి సతీష్ కుమార్, చొల్లంగి శేఖర్, సారిపిల్లి వెంకటరమణ, సింగంపల్లి వెంకట్, కిలాని వెంకటేష్ పాల్గొన్నారు.

జోన్–4 కార్యాలయంలో..

జగదాంబ: జీవీఎంసీ జోన్–4 కార్యాలయంలో సెక్యూరిటీ గార్డులు చలివేంద్రం ఏర్పాటు చేశారు. ప్రస్తుత ఎండల నేపథ్యంలో కార్యాలయానికి వచ్చే ప్రజల సౌకర్యార్థం ఈ చలివేంద్రం ఏర్పాటు చేసినట్టు సెక్యూరిటీ గార్డులు గోవింద్, శ్రీను, రమేష్, ప్రసాద్, నగేష్ తెలిపారు. ఈ చలివేంద్రం ఏర్పాటుపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆటో కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జగన్

డాబాగార్డెన్స్: ఈఎస్ఐ, పీఎఫ్‌తో కూడిన వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని ఆటో రిక్షా కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సత్యనారాయణ డిమాండ్ చేశారు. అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా మంగళవారం ఆటో రిక్షా కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఆటో కార్మికులు 24 గంటల పాటు ప్రజా రవాణాలో కీలక పాత్ర వహిస్తున్నారని, చాలా మంది చదువుకున్నా ఉద్యోగాలు లేక ఆటో కార్మికులుగా పని చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారని చెప్పారు. వారిపై ప్రభుత్వాలు అనేక రూపాల్లో దాడి చేసి రూ. లక్షల కోట్లు వసూలు చేస్తున్నాయని చెప్పారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు బి. జగన్ మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో ఆటో కార్మికులకు అనేక సమస్యలున్నాయని, వాటి పరిష్కారానికి ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి సంస్థలతో చర్చించి, వారి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. సిటు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల కోసం యూడీఐడీ కార్డు

మహారాణిపేట : జిల్లాలోని దివ్యాంగులకు యూనిక్ డిసేబిలిటీ ఐడెంటీ కార్డు (యూడీఐడీ) అన్ని విధాలా ఉపయోగకరంగా ఉంటుందని జిల్లా జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో సంబంధిత పోస్టర్‌ను విడుదల చేశారు. www.rwavambancard.gov.అనే వెబ్‌సైట్‌లో తమ వివరాలు నమోదు చేసుకుని కార్డు పొందవచ్చన్నారు. ఈ కార్డు భారతదేశం అంతటా గుర్తించబడుతుందన్నారు. దివ్యాంగులు వార్డు సచివాలయం ద్వారా గాని, మీ సేవ సెంటర్ ద్వారా గాని యూడీఐడీ గుర్తింపు కార్డు పొందాలని జేసీ తెలిపారు. విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్, వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా సహాయ సంచాలకురాలు జె.మాధవి, అధికారులు పూర్ణిమాదేవి, బి.రమేష్, డాక్టర్ ఎస్‌వీ సమత, ఎం.అబ్దుల్ ఆషా తదితరులు పాల్గొన్నారు.